

భార్య ప్రసూతి వార్డులో..
భర్త శవం మార్చురీలో
● కూతురిని చూసి వెళ్తుండగా డీసీఎం ఢీకొని ఒకరి మృతి
7

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

● ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలి : మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, నవంబరు12(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆర్‌అండ్‌బీ, జాతీయ రహదారి, పోలీసుతోపాటు సంబంధిత అధికారులతో రోడ్డు భద్రతపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అన్ని రోడ్లపై నైట్ విజన్ కెమెరాలు, బ్లింకర్‌లు ఏర్పాటు చేసేందుకు నేషనల్ హైవే రీజినల్ అధికారికి ప్రతిపాదనలు పంపాలని ఆర్‌అండ్‌బీ ఈఈ సర్దార్‌సింగ్‌ను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు సూచిక బోర్డు, మూలమలుపుల దగ్గర హెచ్చరికల బోర్డులు, స్పీడ్ లిమిట్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. రోడ్లపై ఎప్పటికప్పుడు గుంతలను పూడ్చి వేయాలన్నారు. రోడ్డు మరమ్మతుల్లో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, పక్కన ఎస్పీ

సర్వేపై సందేహాలు వద్దు

కొల్చారం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సమగ్ర కుటుంబ కులగణన సర్వేపై సందేహాలు, అపోహలు అవసరం లేదని, ప్రజలు సర్వే ప్రక్రియలో భాగస్వాములై తమ వివరాలను నమోదు చేసుకోవాలని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. మంగళవారం కొల్చారం మండల కేంద్రంలో ఎన్యూమరేటర్‌లు నిర్వహిస్తున్న సర్వే తీరును పరిశీలించారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సమాచారాన్ని నమోదు చేయాలని సూచించారు.

ఎనభై ఫీట్లుగా అల్విన్ బైపాస్‌రోడ్డు విస్తరణ

● రూ.12కోట్లు మంజూరు చేయించిన జగ్గారెడ్డి
● బసవేశ్వర, శివాజీ, అంబేద్కర్, మహాత్మాగాంధీ, నెహ్రూ, రాజీవ్‌గాంధీల పేరిట ఆరుచోట్ల జంక్షన్లు
● 2.5కిలోమీటర్లు పాదయాత్ర చేసిన జగ్గారెడ్డి
● ప్రజలు, వ్యాపారులకు ఇబ్బంది కలగకుండా పనులు చేపట్టాలని అన్ని శాఖల అధికారులకు ఆదేశం



అల్విన్ బైపాస్‌రోడ్డు విస్తరణకు కొలతలు పరిశీలిస్తున్న జగ్గారెడ్డి, జంక్షన్ ఏర్పాటుపై అధికారులకు సూచనలు ఇస్తూ..

సంగారెడ్డి, ఆంధ్రజ్యోతి, నవంబరు 12 : ఎనభై ఫీట్లుగా సంగారెడ్డి పట్టణంలోని అల్విన్ బైపాస్‌రోడ్డును విస్తరించడానికి రూ.12 కోట్లను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి విడుదల చేయించారు. ఐబీ గెస్ట్‌హౌజ్ నుంచి నేషనల్ హైవే సమీపంలోని గుర్రపుబొమ్మ వరకు 2.5 కిలోమీటర్లు ఈ రహదారిని విస్తరిస్తుండగా, మంగళవారం జగ్గారెడ్డి సమీక్షించారు. మున్సిపల్, ఆర్‌అండ్‌బీ, ఎలక్ట్రిసిటీ, హెచ్‌ఎండీఏ అధికారులతో కలిసి బైపాస్ రోడ్డులో పర్యటించారు. రోడ్డు మధ్యలో సింగిల్ స్టోన్‌తో డివైడర్ ఏర్పాటు చేయాలని, ప్రజలు, వ్యాపారులకు ఇబ్బందులు కలగకుండా పనులు చేపట్టాలని ఆదేశించారు. రోడ్డు విస్తరణలో భాగంగా డబ్బాలను తాత్కాలికంగా తొలగించి, పనులు పూర్తికాగానే అదేచోట మళ్లీ ఏర్పాటు చేయించాలని సూచించారు. 2.5కి.మీ.లు జగ్గారెడ్డి పాదయాత్ర చేస్తూ వ్యాపారులు, ప్రజల సలహాలు స్వీకరించారు. రహదారి విస్తరణ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించి చెప్పారు. కాగా ఐబీ గెస్ట్ నుంచి గుర్రపుబొమ్మ వరకు ఆరు చోట్ల జంక్షన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బసవేశ్వర, శివాజీ, అంబేద్కర్, మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, రాజీవ్‌గాంధీ పేరిట ఈ జంక్షన్లు ఉండాలన్నారు.

ధాన్యం పొట్టులో కూరుకుపోయి కూలీ మృతి

దంతాన్‌పల్లి లక్ష్మి బాయిలర్ రైస్‌మిల్లులో ఘటన


యాదగిరి(ఫైల్)

శివ్వంపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): డోజర్ డ్రైవర్ నిర్లక్ష్యంతో ఓ కూలీ మృతిచెందాడు. డోజర్ యంత్రంతో డీసీఎంలో ధాన్యం పొట్టు నింపుతుండగా అందులో కూరుకుపోయి ప్రాణాలొదిలాడు. ఈ సంఘటన దంతాన్‌పల్లి లక్ష్మి బాయిలర్ రైస్‌మిల్లులో మంగళవారం చోటుచేసుకున్నది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా శివ్వంపేట మండలం గుండ్లపల్లి గ్రామానికి చెందిన చిట్టబోయిన శంకరయ్య పొట్టు వ్యాపారం చేస్తాడు. అదే గ్రామానికి చెందిన లింగంపల్లి యాదగిరి(42)ని సోమవారం రాత్రి దంతాన్‌పల్లి శివారులోని లక్ష్మి బాయిలర్ రైస్‌మిల్లులో పొట్టు నింపేందుకు శంకరయ్య కూలీకి తీసుకెళ్లాడు. డీసీఎంలో యాదగిరి పొట్టును సరిచేస్తున్నాడు. ఈ క్రమంలో ట్రాక్టర్ డ్రైవర్ యాదగిరిని గమనించక అతడిపై డోజర్‌తో పొట్టు కుమ్మరించాడు. దీంతో యాదగిరి ఊపిరాడక మృతిచెంది పొట్టులోనే పూడ్చుకుపోయాడు. కూలీకి వచ్చిన యాదగిరి కనిపించకపోవడంతో అనుమానంతో డీసీఎం పొట్టులో వెతకగా మృతదేహం లభించింది. యాదగిరి భార్య లింగంపల్లి శోభ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నర్సాపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఏఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

నాలా శుభ్రం చేస్తూ.. ఊపిరాడక

పారిశుధ్య కార్మికుడి మృతి

న్యాయం చేయాలంటూ కార్మికుల ధర్నా


ఆందోళన చేస్తున్న పారిశుధ్య సిబ్బంది, వివిధ సంఘాల నాయకులు

జిన్నారం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నాలా శుభ్రం చేస్తుండగా ప్రమాదవశాత్తు అందులో పడి ఊపిరాడక మున్సిపల్ కార్మికుడు మృతిచెందాడు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని ఇతర కార్మికులు మంగళవారం ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళితే.. సంగారెడ్డి జిల్లా బొల్లారానికి చెందిన లంబాడీ నర్సింహ(35) మున్సిపల్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. సోమవారం విధులకు వెళ్లి నాలాను శుభ్రం చేస్తుండగా ప్రమాదవశాత్తు అందులో పడి ఊపిరాడక మృతిచెందాడు. రాత్రయినా నర్సింహ తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు, మున్సిపల్ సిబ్బంది ఆచూకీ కోసం వెతకగా.. 17వ వార్డులోని నాలాలో రాత్రి 10 గంటలకు మృతదేహాన్ని గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ఆస్పత్రికి తరలించారు. కాగా మంగళవారం మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట మిగతా కార్మికులు ధర్నా నిర్వహించారు. వివిధ పార్టీలు, కార్మిక సంఘాలు సంఘీభావం ప్రకటించడంతో ఉద్రిక్తత నెలకొంది. మృతుడి కుటుంబానికి రూ.20 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని, తమకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కాగా కలెక్టర్ ఆదేశాలతో సంగారెడ్డి ఆర్డీవో రవీందర్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆందోళన చేస్తున్న కార్మికులు, ఇతర సంఘాల నాయకులు మున్సిపల్ అధికారులతో చర్చించారు. మృతుడి కుటుంబానికి నిబంధనల ప్రకారం అందాల్సిన నష్ట పరిహారం అందిస్తామని హామీఇవ్వడంతో కార్మికులు ఆందోళన విరమించారు. మృతుడి కుటుంబానికి డబుల్‌బెడ్‌రూం, ఆర్థిక సహాయం అందించాలని కోరారు.

వెల్దుర్తి మండలంలో నెలరోజుల వ్యవధిలోనే 11 ఇళ్లలో చోరీలు జరిగాయి. ఈనెల 6న ఉప్పులింగాపూర్‌లో 8 ఇళ్ల తాళాలు పగలగొట్టి బంగారం, వెండి, నగదు అపహరించారు. 9వ తేదీన కూడా ఇదే తరహాలో బీరువా ధ్వంసం చేసి రూ.25వేల నగదుతో ఉడాయించారు. వెల్దుర్తిలో 16 సీసీ కెమెరాలు ఉన్నాయి. కానీ ఏ ఒక్కటి కూడా సరిగా పనిచేయడం లేదు.

కోహీర్ మండలం పీచేర్యాగడి పాత తండాలో గత అక్టోబరు 21న రమేశ్‌స్వామి అనే ఆలయ పూజారి ఇంట్లో దొంగలు చొరబడి రెండు బీరువాలను ధ్వంసం చేశారు. రూ.18లక్షల నగదు, 21తులాల బంగారం, 3కిలోల వెండి అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినప్పటికీ విచారణలో జాప్యం జరుగుతోంది. సొత్తు నేటికీ దొరకలేదు.

అమ్మో దొంగలు

వరుస చోరీలతో కలకలం.. తాళం వేసి ఉన్న ఇళ్లకు కన్నాలు


గుమ్మడిదల మండల కేంద్రంలోని రవీందర్‌రెడ్డి ఇంట్లో బీరువా ధ్వంసం చేసి చెల్లాచెదురుగా పడేసిన సామగ్రి

చాలాచోట్ల పనిచేయని సీసీ కెమెరాలు
నేరస్థులను గుర్తించడంలో తప్పని పాట్లు
అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినా మళ్లీ పునరావృతం
పోలీసులకు సవాల్‌గా మారుతున్న వైనం


వెల్దుర్తిలో చెట్టుకొమ్మల మాటున పనిచేయని సీసీ కెమెరా, నిజాంపేట మండల కేంద్రంలో కారు టైర్లు అపహరణ



ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, నవంబరు 12 : సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ఇటీవల వరుసగా జరుగుతున్న దొంగతనాలు కలకలం రేపుతున్నాయి. తాళం వేసిఉన్న ఇళ్లనే టార్గెట్ చేస్తూ రాత్రి కిరాత్రే చోరీలు చేస్తున్నారు. ముఖ్యంగా ఊరిచివరన ఉన్న ఇళ్లు, అలికిడి లేని ఇళ్లు ఉంటే ఫోకస్ చేస్తున్నారు. పట్టపగలు రెక్కీ నిర్వహించి రాత్రి వేళలో చోరీలకు పాల్పడుతున్నారు. ఈ కేసులను చేధించి సొమ్ము రికవరీ చేయడంలో జాప్యం జరుగుతోంది. సీసీ కెమెరాలు సరిగ్గా పనిచేయకపోవడం, సరైన కోణాల్లో విచారణ సాగకపోవడంతో పాటు ఇతరాత్ర కారణాలు ఉన్నాయి. పెట్రోలింగ్, నిఘా అంశాల్లోనూ లోపాలు లేకపోలేదు. కొన్నిస్టేషన్ల పరిధిలో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టగా.. పలుచోట్ల మాత్రం పరిస్థితి మరోలా ఉంది.

తాళం వేసిన ఇండ్లే టార్గెట్‌గా..

● గుమ్మడిదల మండల కేంద్రంలోని చిమ్ముల రవీందర్‌రెడ్డి ఇంట్లో ఈనెల 3వ తేదీన దొంగలు చొరబడి 31 తులాల బంగారం, 15 తులాల వెండి, రూ.19వేల నగదు అపహరించారు. తాజాగా నిందితుడిని అదుపులోకి తీసుకుని 10తులాల బంగారం మాత్రం స్వాధీనం చేసుకున్నారు. కాగా ఇదే గుమ్మడిదలలో మూడు నెలల క్రితం ఓ విలేఖరి ఇంట్లో జరిగిన దొంగతనాన్ని నేటికీ చేధించలేదు.
● జిన్నారం మండలం ఊట్ల గ్రామ పరిధిలో ఇటీవల ఓ మహిళ ఇంట్లో 4తులాల బంగారం, కొంత నగదును అపహరించారు. ఇక 15 రోజుల క్రితం బొల్లారం పోలీస్‌స్టేషన్ పరిధిలోనూ ఓ ఇంట్లో పట్టపగలే బంగారంతో ఉడాయించారు. ఈ రెండు కేసులనూ చేధించలేకపోయారు.
● నర్సాపూర్ పట్టణంలో గత సెప్టెంబరు 20న కూరగాయల కోసం వచ్చిన ఓ మహిళ మెడలో నుంచి మూడున్నర తులాల బంగారాన్ని అపహరించారు. అక్టోబరు 5న మద్యంషాపులో రూ.40వేల విలువైన మద్యాన్ని పట్టుకెళ్లారు.
● శివ్వంపేట మండలం చిన్నగొట్టిముక్కుల గ్రామంలో గత అక్టోబరు 20న రెండు ఇండ్ల తాళాలు పగలగొట్టారు. శంకర్‌గౌడ్ ఇంట్లో రూ.1.50లక్షల నగదు, 20తులాల వెండి, తులం బంగారం, శ్రీపతి రావు ఇంట్లో 10తులాల వెండి, రూ.5వేల నగదు ఎత్తుకెళ్లారు.
● మెదక్ జిల్లా నిజాంపేట మండల కేంద్రంలో నిలిపి ఉన్న 3 వాహనాల టైర్లను ఆగస్టు నెలలో దొంగిలించారు. వీరిని తాజాగా అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు.
● టేక్మాల్ మండలం కాదులూరు గ్రామ శివారులోని ఎల్లమ్మగుడిలో అక్టోబరు 15న హుండీ కొల్లగొట్టి రూ.75వేలు

మిగతా 8వ పేజీలో

కృత్రిమమే మేలు

సాంకేతికతతో పశుసంపద వృద్ధి



● లింగ నిర్ధారిత వీర్య నాళికలతో పాడికి కృత్రిమ గర్భధారణ
● మేలు జాతి ఆడ దూడల పునరుత్పత్తికి అవకాశం
● సబ్సిడీపై అందజేస్తున్న ప్రభుత్వం
● 90 శాతం కచ్చితత్వం.. పాడి రైతుల హర్షం

7


నిలిచిపోయిన ఐవోసీ భవన నిర్మాణం

నిధులు వచ్చేనా.. భవనం పూర్తయ్యేనా!

తూప్రాన్‌లో ఏడాదిగా నిలిచిపోయిన ఐవోసీ నిర్మాణం

తూప్రాన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఉన్న తూప్రాన్ పట్టణంలో ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకేచోట ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వ నిర్ణయించింది. గజ్వేల్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మాజీ సీఎం కేసీఆర్ సమీకృత కార్యాలయాల సముదాయం ఏర్పాటుకు నిర్ణయించారు. గడ నుంచి ఎస్‌డీఎఫ్ నిధులు రూ.10 కోట్లను కేటాయించారు. అయితే, తూప్రాన్ పట్టణాభివృద్ధికి ఈ నిధుల నుంచి రూ.2 కోట్లను కేటాయించారు. మండల కార్యాలయాల ప్రదేశంలోని మండల సమాఖ్య, ఐకేపీ, ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్, విద్యా వనరుల కేంద్రం, తహసీల్దారు కార్యాలయాలను కూల్చివేసి 2022 మార్చిలో ఐవోసీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రెండేళ్లు గడిచినా పూర్తి కాలేదు. రూ.8 కోట్ల మేరకు పనులు నిర్వహించి అర్ధాంతరంగా నిలిపివేశారు. గతంలో జీఎస్‌టీ 12శాతం ఉండగా, జీఎస్‌టీని 18శాతానికి పెంచడంతో మరిన్ని నిధులు అవసరం ఏర్పడింది. మరో రూ.3 కోట్లు మంజూరైతే నిర్మాణం పూర్తి చేయనున్నట్లు తెలిసింది.

ఇబ్బందులు పడుతున్నాం

తూప్రాన్ తహసీల్దారు ఆఫీస్‌ను కూల్చివేయడంతో ఇరుకైన పాత మున్సిపాలిటీ భవనంలో ప్రస్తుతం కొనసాగిస్తున్నాం. సిబ్బందికి కూర్చోడానికి సైతం సరైన వసతి లేదు. కార్యాలయానికి వచ్చే ప్రజలకు, రిజిస్ట్రేషన్‌కు వచ్చే వారికి ఇబ్బందిగా ఉంది. ఐవోసీ భవనం త్వరగా పూర్తి చేస్తే ఇబ్బందులు లేకుండా పోతాయి.

- విజయలక్ష్మీ, తహసీల్దారు, తూప్రాన్

పిట్టలవాడపై చిన్నచూపు

పేరుకే డబుల్ ఇళ్లు.. వసతులు కరువు

మురుగు కాల్వలు, రోడ్ల నిర్మాణం ఏదీ?


పిట్టలవాడలో పెచ్చులూడిన ఓ ఇంటి గోడ, పగిలిన కిటికీ అద్దం

శివ్వంపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : అవి పేరుకే డబుల్‌బెడ్‌రూం ఇళ్లు.. ఎక్కడో చెట్టుపుట్టల మధ్య నిర్మించారు.. మౌలిక సదుపాయాలను కల్పించడం మరిచారు. మెదక్ జిల్లా శివ్వంపేట మండలం సికింద్లాపూర్ పిట్టలవాడలో గత ప్రభుత్వం 30 మందికి డబుల్ బెడ్‌రూం ఇళ్లను అందజేసింది. ప్రస్తుతం ఆ ఇళ్లల్లో 200 మంది వరకు జీవనం కొనసాగిస్తున్నారు. సికింద్లాపూర్ - గోమారం ప్రధాన రోడ్డు నుంచి దాదాపు రెండు కిలోమీటర్ల దూరంలో ఉండే పిట్టలవాడకు వెళ్లడానికి కంకరతేలిన మట్టి రోడ్డే దిక్కు. వర్షాకాలం ఈ రోడ్డు గుండా వెళ్లాలంటే నరకయాతన తప్పడం లేదు. వీధి లైట్లు లేకపోవడంతో వాహనదారులు రాత్రివేళ ప్రమాదాల బారిన పడుతున్నారు. నాలుగేళ్ల క్రితం డబుల్‌బెడ్‌రూం ఇళ్లు వచ్చాయని సంబరపడగా అవి ప్రస్తుతం అధ్వానంగా తయారయ్యాయి. పగిలిన కటికీల అద్దాలు, పెచ్చులూడి, బీటలు వారిన గోడలు దర్శనమిస్తున్నాయి. ప్రధానంగా అంతర్గత రోడ్లు, మురుగు కాల్వలను నిర్మించకపోవడంతో అవస్థలు తప్పడం లేదు.


అంతర్గత రోడ్లు, మురుగు కాల్వలు లేని పిట్టలవాడ

ఇక్కడ ఉన్న నాలుగు వీధుల్లో కరెంటు పోల్స్ ఉన్నా వీధి దీపాలు మాత్రం లేవు. మిషన్ భగీరథ నీటిని రెండుమూడు రోజులకోసారి సరఫరా చేస్తున్నారని, దీంతో తాము ఉప్పునీరు తాగాల్సిన పరిస్థితి నెలకొన్నదని ఇక్కడి వారు వాపోయారు. నాసిరకమైన ఇళ్లల్లో, అరకొర వసతుల మధ్య అవస్థలు పడుతున్నా అధికారులు పట్టించుకుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిట్టలవాడ సమీపంలో పాఠశాల లేకపోవడంతో 30 మంది విద్యార్థులు 3 కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ సికింద్లాపూర్‌కు వెళ్లాల్సి వస్తున్నది. కొంతమంది దూరం వెళ్లలేక చదువులకు దూరమవుతున్నారు.

సాయిబాబా ఆలయాన్ని అభివృద్ధి చేస్తా: ఎమ్మెల్యే

మాసాయిపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మాసాయిపేట సాయిబాబా ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో గల సాయిబాబా ఆలయం 9వ వార్షికోత్సవంలో పాల్గొన్నారు. అంతకుముందు విఠలేశ్వరాలయంలో పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి పాటుపడుతున్న కమిటీ సభ్యులను, నాయకులను అభినందించారు. కాగా మూడురోజుల క్రితం కాంగ్రెస్ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి నానమ్మ మృతిచెందారు. దీంతో ఎమ్మెల్యే సునీతారెడ్డి మంగళవారం మాసాయిపేటలో రాజిరెడ్డి ఇంటికెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు.


ఆవుల రాజిరెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

వార్షిక పరీక్షలకు సిద్ధం కావాలి

● రాష్ట్ర అకాడమిక్ పర్యవేక్షణ అధికారి వెంకటస్వామి


పది పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వెంకటస్వామి

వెల్దుర్తి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పది పరీక్షలకు సమయం దగ్గర పడుతుందని, విద్యార్థులు సిద్ధం కావాలని రాష్ట్ర అకాడమిక్ పర్యవేక్షణ అధికారి వెంకటస్వామి సూచించారు. మంగళవారం వెల్దుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించి పదో తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల సమయం దగ్గరలో ఉన్నదని, ప్రతీ విద్యార్థి కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఉపాధ్యాయులు బోధించే ప్రతీ అంశాన్ని శ్రద్ధగా వినాలని, ఉపాధ్యాయులు బోధించే అంశంలో ఏదైనా సమస్య ఉన్నా, అర్థం కాకపోయినా వెంటనే అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సాంబయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో విద్యార్థులకు ప్రయోజనం

● మెదక్ జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు



రంజోల్‌లో మాట్లాడుతున్న మెదక్ డీఈవో వెంకటేశ్వర్లు

జహీరాబాద్, నవంబరు 12: పాఠశాలల్లో గ్రంథాలయాలు ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని రంజోల్ గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలలో రీడ్ టూ రూంను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రంథాలయాలు జ్ఞాన బాండాగారాలని గుర్తు చేశారు. విద్యార్థులు ప్రతీ పుస్తకాన్ని చదువుకోవాలని, అందుకోసం కొంత సమయాన్ని కేటాయించాలన్నారు. పాఠశాలల్లో ఏర్పాటుచేసిన రీడ్‌టూరూంలు విద్యార్థులకు ఉపయోగకరంగా మారనున్నాయని పేర్కొన్నారు. రీడ్‌టూ రూంలలో అందుబాటులో ఉంచే వివిధరకాల పుస్తకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి బస్వరాజ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న జోనల్‌స్థాయి క్రీడా పోటీలు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జోనల్ క్రీడల ఇన్‌చార్జి భీమయ్య

నారాయణఖేడ్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఖేడ్ పట్టణ శివారులోని సాంఘీక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో 10వ జోనల్ 2024-25 స్పోర్ట్‌మీట్‌లో భాగంగా 6వ చార్మినర్ జోనల్‌స్థాయి క్రీడా పోటీలు రెండో రోజు మంగళవారం కొనసాగాయి. జోన్ పరిధిలోని 11 గురుకులాల బాలురు పోటీల్లో పాల్గొన్నారు. పోటీలను సాంఘీక సంక్షేమ గురుకులాల రాష్ట్ర అధికారి, జోనల్ క్రీడల ఇన్‌చార్జి భీమయ్య సందర్శించారు. ఈ సందర్భంగా కబడ్డీ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. భోజన, బస, వసతులు తదితర ఏర్పాట్లను పరిశీలించారు. ఆయనవెంట క్రీడల జోనల్ సమన్వయకర్త లాలు, 11 గురుకులాల ప్రిన్సిపల్స్, పీడీలు, పీఈటీలు ఉన్నారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి పోరాటాలు

● బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయిబాషా


మాట్లాడుతున్న బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయిబాషా

సంగారెడ్డి అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేస్తామని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయిబాషా స్పష్టం చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన సందర్భంగా సంగారెడ్డిలోని ఐబీలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు ఎప్పటికప్పుడు అధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సాయిబాషాను పట్టణ యువత సన్మానించారు.

వాహనాల వేగ నియంత్రణకు ప్రత్యేక చర్యలు

● జోగిపేట సీఐ అనిల్‌కుమార్

పుల్‌కల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161 జాతీయ రహదారిపై వాహనాల వేగ నియంత్రణకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. జాతీయ రహదారిపై తాడ్దానిపల్లి చౌరస్తా, సుల్తాన్‌పూర్ గ్రామాల వద్ద జాతీయ రహదారిని జిగ్‌జాగ్‌గా మార్చారు. ఇందులో భాగంగానే మంగళవారం ఆయా ప్రాంతాల్లో డ్రమ్ములకు ఎల్లో స్టిక్కర్లను అతికించడమే కాకుండా భారీ కేడ్లను ఏర్పాటు చేశారు. టోల్‌ప్లాజా దాటాగానే వాహనాలు వేగంగా వెళ్తుండగా తరచూ ఆయా ప్రాంతాల వద్ద రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాలను నియంత్రించేందుకు చర్యలు చేపట్టామని జోగిపేట సీఐ అనిల్‌కుమార్, పుల్కల్ ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్ తెలిపారు. జోగిపేట సర్కిల్ పరిధిలో 161 జాతీయ రహదారి విస్తరించడంతో పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ప్రమాదాల జరిగే ప్రాంతాలను గుర్తించి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

జాతీయ సైక్లింగ్ జట్టు మేనేజర్‌గా వెంకటనర్సయ్య



వెంకట నర్సయ్య

అక్కన్నపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సైక్లింగ్ జట్టు మేనేజర్‌గా జంగపల్లి వెంకటనర్సయ్య నియామకమయ్యారు. అక్కన్నపేట మండలం గౌరవెల్లి ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా ఆయన పనిచేస్తున్నారు. ఈ నెల 15 నుంచి 19 వరకు చెన్నైలో జరిగే జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీల్లో తెలంగాణ తరఫున ఆడే జట్టుకు ఆయన మేనేజర్‌గా వ్యవహరించనున్నారు.

రోయింగ్ పోటీల్లో జశ్వంత్‌కు సిల్వర్ మెడల్



జశ్వంత్

సిద్దిపేట కల్చరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఆల్ ఇండియా ఇంటర్ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా రోయింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో సిద్దిపేటకు చెందిన కాముని జశ్వంత్ సిల్వర్ మెడల్ సాధించాడు. ఈ నెల 5 నుంచి 11 వరకు కేరళ రాష్ట్రం అలెప్పీలో పోటీలు నిర్వహించారు. జశ్వంత్ హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో పదోతరగతి చదువుతున్నాడు.

16 నుంచి రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు

చేగుంట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లా చేగుంట మండల కేంద్రంలో ఈ నెల 16 నుంచి వాలీబాల్ రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు టోర్నమెంట్ ఆర్గనైజేషన్ సెక్రటరీ అల్లి నరేష్, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షులు అయిత పరంజ్యోతి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు మెదక్ ఎంపీ రఘునందన్‌రావును ఆహ్వానించినట్లు తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్, ఆర్గనైజేషన్ సభ్యులు తెలిపారు.



కృత్రిమమే మేలు

సాంకేతికతతో పశుసంపద వృద్ధి

- లింగ నిర్ధారిత వీర్య నాళికలతో పాడికి కృత్రిమ గర్భధారణ
- మేలు జాతి ఆడ దూడల పునరుత్పత్తికి అవకాశం
- సబ్సిడీపై అందజేస్తున్న ప్రభుత్వం
- 90 శాతం కచ్చితత్వం.. పాడి రైతుల హర్షం



పాడి పశువుకు కృత్రిమ గర్భధారణ పరీక్షలు చేస్తున్న వైద్యుడు

సిద్దిపేట రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయంతోపాటు అదనపు ఆదాయం కోసం పాలఉత్పత్తిపై దృష్టిసారిస్తున్నారు. ఒకప్పుడు గేదెలు, ఆవులకు ఆడ దూడనే పుట్టాలనే కోరుకునేవారే తప్పా ఏదనేది వారి చేతుల్లో ఉండేదికాదు. కానీ ఇప్పుడున్న సాంకేతికతతో అది సాధ్యమవుతున్నది. ఆవులు, గేదెలకు లింగ నిర్ధారిత వీర్యం(సెక్స్ సార్టెడ్ సిమన్)తో కృత్రిమ గర్భధారణ చేయించి మేలుజాతి దూడల పునరుత్పత్తి చేస్తున్నారు. సిద్దిపేట జిల్లాలోని ప్రాథమిక పశువైద్య కేంద్రాలు, ఉప కేంద్రాలు, గోపాలమిత్ర కేంద్రాల్లో ఈ విధానం అందుబాటులోకి వచ్చింది.

90 శాతం కచ్చితత్వం..

ఎదకు వచ్చిన పశువుకు కృత్రిమ గర్భధారణ చేయిస్తే 90 శాతం కచ్చితత్వంతో అధిక పాల దిగుబడి సామర్థ్యం గల మేలు జాతి ఆడ దూడలు పుట్టే అవకాశం ఉన్నది. అమెరికా వ్యవసాయ శాఖ మొదటగా కనుగొన్న ఈ సాంకేతికతను ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రీయ గోకుల్ మిషన్ సహకారంతో సబ్సిడీపై అందిస్తూ పాడి రైతులకు మేలు చేస్తున్నది. లింగ నిర్ధారిత వీర్య స్ట్రాలు(నాళికలు) పశు వైద్య కేంద్రాల్లో మైనస్ 196 డిగ్రీల సెల్సియస్‌లో భద్రపరుస్తారు. సరైన సమయంలో పాడి గేదెలు, ఆవులను పశువైద్యులకు వద్దకు తీసుకెళ్తే చెవిపోగు నంబరు, ఇతర వివరాలు నమోదు చేసుకుని లింగ నిర్ధారిత వీర్యం నాళికలతో కృత్రిమ గర్భధారణ చేయిస్తారు. వినియోగించిన నాళికలను రైతులకే అందజేస్తారు. అవసరమైనప్పుడు నాళికలపై ఉన్న నంబర్ సహాయంతో ఈ గోపాల యాప్‌లో పరిశీలించుకోవచ్చు. కృత్రిమ గర్భధారణ అనంతరం 90 రోజులకు గర్భ నిర్ధారణ పరీక్ష చేయించాల్సి ఉంటుంది. దూడపుట్టిన 15 రోజులలోపు పశువైద్యులకు వివరాలు అందించాలి.

సబ్సిడీపై నాళికలు..

ఒక లింగ నిర్ధారిత వీర్య నాళిక విలువ రూ.675 కాగా, ప్రభుత్వం రూ.425 సబ్సిడీ ఇస్తున్నది. అంటే రైతులు కేవలం రూ.250 చెల్లిస్తే సరిపోతుంది. కృత్రిమ గర్భధారణ చేయించినా పశువు గర్భం దాల్చకపోతే మరోసారి చేయించాలి. రెండు సార్లు గర్భం దాల్చడం విఫలమైతే. రైతు చెల్లించిన రూ.500లను తెలంగాణ పశుగణాభివృద్ధి సంస్థ తిరిగి చెల్లిస్తుంది.

పాడి రైతులకు మంచి సదావకాశం..



చిన్న, సన్నకారు రైతులు ఎక్కువ శాతం పాడి ఆవులు, గేదెలను పోషించుకుంటారు. మేలు జాతి దూడలే పుట్టేందుకు ప్రభుత్వం వీర్యం స్ట్రాలతో కృత్రిమ గర్భధారణ చేయడంతో రైతులు ఎంతో ఉపయోగం. అదీకూడా సబ్సిడీపై అందించడం చాలా సంతోషం.

-మారెడ్డి మధుసూదన్‌రెడ్డి, పాడి రైతు, ఇర్కోడు

అన్నీ పశు వైద్య కేంద్రాల్లో..



జిల్లాలోని అన్నీ పశు వైద్య కేంద్రాల్లో లింగ నిర్ధారణ వీర్య నాళికలు అందుబాటులో ఉన్నాయి. ఎటువంటి గర్భకోశ వ్యాధులు లేని ఆరోగ్య వంతమైన పశువుల్లో సక్సెస్ రేటు ఎక్కువగా ఉంటుంది. ఇది పాడి రైతులకు ప్రభుత్వం అందిస్తున్న మంచి అవకాశం. పూర్తి వివరాలకు దగ్గరలోని ప్రాథమిక పశు వైద్య కేంద్రాలు, ఉప కేంద్రాలు, ఆరోగ్య మిత్రలను సంప్రదించాలి.

-డాక్టర్ ఏ.వెంకట్‌రెడ్డి, పశు సంవర్థక శాఖ జాయింట్ డైరెక్టర్, సిద్దిపేట

జిల్లా కోర్టులో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కోర్టులో స్టెనో, రికార్డ్ అసిస్టెంట్ ఉద్యోగాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ యువకులు ఈ నెల 13 నుంచి డిసెంబర్ 7వ వరకు న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో నేరుగా గానీ, రిజిస్టర్డ్ పోస్ట్‌లో, లేదా కొరియర్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. లేదా సంగారెడ్డి.డికోర్ట్స్‌గవ్.ఇన్ వెబ్‌సైట్‌లో వివరాలను పొందవచ్చునని పేర్కొన్నారు.

మలేషియాలో మట్టి కళా ప్రదర్శన



మలేషియాలో కళా ప్రదర్శనను వీక్షిస్తున్న ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు

- హాజరైన రాష్ట్ర ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు

మిరుదొడ్డి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల మైటా మలేషియాలో జరిగిన కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం అందె గ్రామానికి చెందిన అంగడి భాస్కర్ టీం పాల్గొన్న విషయం తెలిసిందే. మంగళవారం మలేషియా ప్రభుత్వం దీపావళి ఉత్సవాలను నిర్వహించింది. ఈ సందర్భంగా డప్పు కళాకారుడు భాస్కర్ బృందం మట్టి కళారూపం ప్రదర్శనను డప్పు దరువులతో నిర్వహించింది. ఈ ప్రదర్శనను రాష్ట్ర ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ అవార్డు గ్రహీత భాస్కర్ వీక్షించారు. తెలంగాణ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో మట్టి కళాకారులకు అవకాశాలు కల్పించడం పట్ల మలేషియా ప్రభుత్వానికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

వియత్నాంకు విస్తరించిన 'గీతం' అధ్యాపకుడి సేవలు

- వియెన్ డాంగ్ కళాశాలలో ఆతిథ్య ఉపన్యాసాలు



డాక్టర్ నిరంజన్ అప్పస్వామి

పటాన్‌చెరు రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఇంతవరకు పరిశోధనలు చేపట్టడానికి విదేశాలకు వెళ్తున్న గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం అధ్యాపకులు ఇప్పుడు తమ వృత్తి నైపుణ్యాన్ని విదేశీ విద్యార్థులతో కూడా పంచుకుంటున్నారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, హైదరాబాద్‌లోని సీఎస్ఈ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నిరంజన్ అప్పస్వామి కృత్రిమ మేథా(ఏఐ)పై ఈ నెల 10 నుంచి 24 వరకు ఆతిథ్య ఉపన్యాసాలు ఇవ్వడానికి వియత్నాం హోచిమిన్ సిటీలోని వియెన్ డాంగ్ కళాశాలకు బయలుదేరి వెళ్లారు. అధ్యాపక వృత్తిలో 25 ఏళ్ల బోధనానుభవం గడించిన నిరంజన్ నవంబరు 2022, 2023 రెండు విద్యా సంవత్సరాల్లోనూ రెండువారాల పాటు వియెన్ డాంగ్ కళాశాల విద్యార్థులకు జావా, ఫ్లట్టర్‌లో ప్రయోగాత్మక శిక్షణ ఇచ్చారు. విద్యాపరమైన సహకారాన్ని పెంపొందించడం, మెరుగుపరచడంలో ఆయన నిబద్ధత, నైపుణ్యాలు వియత్నాం విద్యార్థులపై ప్రభావం చూపాయి. సైబర్ సెక్యూరిటీ, మెషిన్ లెర్నింగ్‌లో పీహెచ్‌డీని కలిగి ఉన్న ఆయన 21 పాఠ్య పుస్తకాలను రచించారు.

జిల్లాస్థాయి క్రీడాపోటీలు ప్రారంభం



విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు

పటాన్‌చెరు రూరల్, నవంబరు 12, (ఆంధ్రజ్యోతి) : ముత్తంగి మహాత్మా జ్యోతిభాపూలే బాలికల గురుకుల కళాశాలలో అండర్-19 జిల్లా స్థాయి క్రీడా పోటీలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మెదక్ ఆర్సీవో గౌతమ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభిచారు. 16 పాఠశాలలకు చెందిన 525 మంది బాలికలు ఈ పోటీల్లో పాల్గొననున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నవనీత, పలు కళాశాలల సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

80 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

మనోహరాబాద్, నవంబరు (ఆంధ్రజ్యోతి) 12 : అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు. ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం సూరారం, జిడిమెట్ల ప్రాంతానికి చెందిన బుస్స లింగం రెండు వాహనాల్లో మనోహరాబాద్ మండలం దండుపల్లి వద్ద మంగళవారం ఓ రైస్‌మిల్లుకు చెందిన శివ అనే వ్యక్తి పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి తరలిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు దాడులు చేసి వాహనాల్లో తరలిస్తున్న 80 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

డివైడర్‌ను ఢీకొన్న బైకు.. ఒకరి మృతి

తూప్రాన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణ శివారులో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు తూప్రాన్ పోలీసులు తెలిపారు. బోరబండలోని న్యూరామారావునగర్‌కు చెందిన జిల్లెల్ల రాజేల్లు (41) తూప్రాన్ పట్టణానికి బైక్‌పై వస్తుండగా, హైవే బైపాస్‌లోని పాత నలంద కళాశాల వద్ద డివైడర్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి



నవీన్(ఫైల్)

చిన్నకోడూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి చెందిన సంఘటన చిన్నకోడూరు మండలం ఇబ్రహీంనగర్‌లోని రాజీవ్‌రహదారిపై జరిగింది. ఎస్‌ఐ బాలకృష్ణ కథనం ప్రకారం దుబ్బాక మండలం రామక్కపేటకు చెందిన పెంబర్తి నవీన్(38) కోహెడ పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్(రైటర్)గా పనిచేస్తూ సిద్దిపేట పట్టణంలో నివాసముంటున్నాడు. మంగళవారం రాత్రి నవీన్ కోహెడ నుంచి కారులో సిద్దిపేటకు వస్తుండగా ఇబ్రహీంనగర్ గ్రామం వద్దకు రాగానే కారు అదుపుతప్పి డివైడర్‌ను దాటి సిద్దిపేట వైపు నుంచి కరీంనగర్ వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. దీంతో నవీన్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

భార్య ప్రసూతి వార్డులో.. భర్త శవం మార్చురీలో..

- కూతురును చూసి వెళ్తుండగా, డీసీఎం ఢీకొని వ్యక్తి మృతి



విజయ్ యాదవ్ (ఫైల్)

మనోహరాబాద్, నవంబరు (ఆంధ్రజ్యోతి)12: ఒకే ఆస్పత్రిలో భార్య డెలివరీ అయి ఉండగా.. మార్చురీలో భర్త మృతదేహాన్ని భద్రపర్చిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. వివరాలు ఇలా ఉన్నాయి. మనోహరాబాద్ మండలం కూచారం గ్రామానికి చెందిన మజ్జతి విజయ్ యాదవ్(30), మౌనిక దంపతులకు ఇప్పటికే ఒక కూతురు ఉంది. సోమవారం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రిలో మరో పాపకు మౌనిక జన్మనిచ్చింది. దీంతో మంగళవారం విజయ్ తన స్నేహితుడితో కలిసి ఆసుపత్రిలోని తన కూతురుని చూసి తిరిగి బైకుపై బయలుదేరాడు. మనోహరాబాద్ మండలం దండుపల్లి 44వ జాతీయ రహదారిపై వస్తుండగా డీసీఎం ఢీకొట్టడంతో విజయ్ అక్కడికక్కడే మృతి చెందగా,స్నేహితుడు ప్రేమ్‌కుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తెలిపారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

గజ్వేల్ రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): చేపల వేటకు వెళ్లిన వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా క్రిస్టియన్‌పల్లి గ్రామానికి చెందిన పెద్ద యాదయ్య(54) బతుకుదెరువు కోసం గజ్వేల్ పట్టణంలోని లక్ష్మీప్రసన్నకాలనీలో నివాసముంటూ పాత సామాను వ్యాపారం చేస్తున్నాడు. సోమవారం చేపల వేటకు వెళ్లిన ఆయన రాత్రి అయినా తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు మంగళవారం పట్టణ పరిసర ప్రాంతంలో వెతుకుతుండగా సంగాపూర్ సమీపంలోని కదుల్ల కుంటపై ద్విచక్రవాహనం కనిపించింది. కుంటలో వెతకగా యాదయ్య మృతదేహం లభించింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని గజ్వేల్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు

గంజాయి విక్రేతల అరెస్టు

- 300 గ్రాముల ఎండు గంజాయి స్వాధీనం..
- ఒకరు హత్య కేసులో నిందితుడు, మరొకరు బీటెక్ విద్యార్థి
- వివరాలు వెల్లడించిన తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకట్‌రెడ్డి

తూప్రాన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణ శివారులో గంజాయి విక్రయిస్తున్న నలుగురి పట్టుకొని, ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి తెలిపారు. తూప్రాన్ డీఎస్పీ కార్యాలయంలో మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు తూప్రాన్ పట్టణానికి చెందిన నీలం అజయ్ (21), సామగారి లోకేష్ (18), మామిండ్ల తరుణ్ (20), అమిత్ సింగ్ (25) పట్టణ శివారులోని లక్ష్మీనర్సింహ వెంచర్‌లో ఎండు గంజాయి విక్రయిస్తున్నట్లు నమ్మదగిన సమాచారం వచ్చింది. దీంతో పోలీసులు మంగళవారం దాడులు చేసి వారిని అదుపులోకి తీసుకుని వారి నుంచి 300 గ్రాములు ఎండు గంజాయితోపాటు మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నలుగురిని నార్కోటిక్ డ్రగ్ అండ్ సైకోట్రోపిక్ యాక్ట్ ప్రకారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇందులో తూప్రాన్ సీఐ రంగ కృష్ణ, ఎస్‌ఐ శివానందం పాల్గొన్నారు. గంజాయి కేసులో నిందితులుగా ఉన్న నీలం అజయ్ గతంలో 2022లో జరిగిన హత్య కేసులో నిందితుడిగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అంతేకాకుండా మరో నిందితుడు లోకేష్ ప్రస్తుతం బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్నట్లు వారు వివరించారు.

తవ్వుతున్నారు.. అమ్ముతున్నారు..

- రెచ్చిపోతున్న మట్టి మాఫియా
- జోరుగా అక్రమ తవ్వకాలు



జూమ్లానాయక్ తండా పరిధిలో గుట్ట నుంచి మట్టి తవ్వకాలు

కోహెడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కోహెడ మండలంలో మట్టి మాఫియా ఆగడాలకు హద్దు లేకుండా పోయింది. అధికారుల అండతో గత ఆరు నెలల నుంచి బరితెగించి ప్రకృతి వనరులను దోచేస్తున్నారు. అనుమతులు లేకున్నా నిబంధనలు మట్టిలో తొక్కి గుట్టలను చెరబడుతున్నారు. కళ్లెదుటే ప్రకృతి సంపద అంతరించిపోతున్నా అడ్డుకోవాల్సిన అధికారులు గట్టున నిలబడి కళ్లప్పగించి చూస్తున్నారు. తవ్వుకుంటాం, అమ్ముకుంటాం చాతనైతే ఏమైనా చేసుకోండి అంటూ సవాల్ విసురుతున్నారు. కోహెడ మండలం ధర్మసాగర్ పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని జూమ్లానాయక్ తండా సమీపంలో గుట్టల మట్టిని వారం రోజులుగా నిత్యం వందల లారీల్లో తరలిస్తున్నారు. రెవెన్యూ, అటవీ శాఖ పరిధిలో ఈ గుట్టలు ఉండగా ఎలాంటి అనుమతులు లేకుండా రాత్రిళ్లలో మట్టిని కాజేస్తున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, పోలీస్, మైనింగ్ శాఖ అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపణలు ఉన్నాయి. పోలీసు శాఖకు ఫిర్యాదు చేస్తే అది తమ పని కాదని, రెవెన్యూ ఫిర్యాదు చేస్తే సిబ్బంది లేరని, మైనింగ్ శాఖకు ఫిర్యాదు చేస్తే తమకు చాలా పనులు ఉన్నాయని తప్పించుకుంటున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. మూడు శాఖల మధ్య సమన్వయ లేకపోవడం మట్టి మాఫియాకు వరంగా మారింది. అక్రమార్కులు ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ లక్షలు సంపాదిస్తున్నారు. దీంతో మున్ముందు పర్యావరణ సమతుల్యత కనుమరుగవుతుందని పర్యావరణ ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మేఘశాల ట్రస్ట్ ఆఫ్ బెంగళూరు సౌజన్యంతో ట్యాబ్‌ల పంపిణీ

చిన్నశంకరంపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మేఘశాల ట్రస్ట్ ఆఫ్ బెంగళూరు సౌజన్యంతో డీఈవో రాధాకిషన్ చేతుల మీదుగా మంగళవారం ఎంఈవో పుష్పవేణికి కంప్యూటర్ ట్యాబ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ కంప్యూటర్ ట్యాబ్‌లలో పాఠ్యాంశాలు విద్యార్థులకు సంబంధించిన అంశాలు ఉంటాయన్నారు.

'తండాను వట్‌పల్లి పంచాయతీలో విలీనం చేయాలి'

వట్‌పల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంచిర్యాల గిరిజన తండా గ్రామపంచాయతీలో ఉన్న అంబోజి బొగడ గిరిజన తండాను వట్పల్లి గ్రామపంచాయతీలో విలీనం చేయాలని కోరుతూ మంగళవారం స్థానిక ఎంపీవో ఖాజా నసిరోద్దీన్‌కు తండావాసులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు, గత నెలలో విడుదల చేసిన ఓటరు జాబితా ప్రకారం అంబొజిబొగుడ గిరిజన తండా వట్‌పల్లి గ్రామపంచాయతీలో ఉండగా దీనిని మంచిర్యాల గిరిజన తండాలో ఉంచడంతో అభివృద్ధిలో వెనుకబడుతుందన్నారు.

ట్రస్టు ఆధ్వర్యంలో పరీక్ష ఫీజు చెల్లింపు

చిన్నశంకరంపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో ధరిపల్లి హైస్కుల్ లో 36 మంది విద్యార్థులకు సంబంధించిన పదో తరగతి పరీక్ష ఫీజు మొత్తం రూ. 4,500ను ఆర్ట్ టు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో చెల్లించారు. మంగళవారం హైస్కూల్లోని వెంకటలక్ష్మి అసిస్టెంట్ విద్యుత్‌శాఖ అధ్వర్యంలో పరీక్ష ఫీజులు చెల్లించినట్లు దాత రవి, తెలిపారు.

కొండాపూర్ సీఐగా వెంకటేష్

కొండాపూర్, నవంబర్ 12(ఆంధ్రజ్యోతి): కొండాపూర్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం నూతన సీఐగా డి. వెంకటేష్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీఐ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ రూపేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఉద్యోగుల నిరసన గళం

దాడి చేసినవారిపై చర్యలు తీసుకోవాలి



సంగారెడ్డి కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న రెవెన్యూ ఉద్యోగుల సంఘం నాయకులు



మెదక్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నరేందర్



తూప్రాన్ రెవెన్యూ డివిజన్ కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసనలో ఆర్డీవో, ఉద్యోగులు

న్యూస్ నెట్‌వర్క్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా లగచర్లలో ఫార్మాసిటీ కోసం ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన క్రమంలో ఆ జిల్లా కలెక్టర్‌తో పాటు రెవెన్యూ అధికారులపై జరిగిన దాడిని నిరసిస్తూ సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని రెవెన్యూ ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయా జిల్లాల్లోని కలెక్టరేట్‌లు, తహసీల్ కార్యాలయాల ఎదుట ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు.

సంగారెడ్డిలో..

సంగారెడ్డిలో కలెక్టరేట్‌లో రెవెన్యూ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాములు, కిరణ్‌కుమార్ మాట్లాడుతూ అధికారులపై దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. పటాన్‌చెరులోని తహసీల్ కార్యాలయం ఎదుట రెవెన్యూ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. కోహీర్ తహసీల్ కార్యాలయంలో ఆవరణలో తహసీల్దార్ బాలశంకర్, ఉద్యోగులు, సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.

మెదక్ జిల్లాలో...

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో పాటు రెవెన్యూ అధికారులపై కొంత మంది రైతుల ముసుగులో జరిపిన దాడిని టీఎన్జీవోస్ మెదక్ జిల్లా పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ తెలిపారు. మంగళవారం జిల్లాలోని ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షులు ఇక్బాల్‌పాషా, మెదక్, నర్సాపూర్ యూనిట్ల అధ్యక్షులు రామాగౌడ్, శేషాచారి, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు. తూప్రాన్ రెవెన్యూ డివిజన్, తూప్రాన్ తహసీల్దారు కార్యాలయాల వద్ద ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. తూప్రాన్ రెవెన్యూ డివిజన్ వద్ద నిరసనలో ఆర్డీవో జయచంద్రారెడ్డి, ఉద్యోగులు అదేవిధంగా తూప్రాన్ తహసీల్ కార్యాలయం వద్ద జరిగిన నిరసనలో తహసీల్దారు విజయలక్ష్మి, డీటీ ప్రభుదాస్, సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. నర్సాపూర్ ఆర్డీవో కార్యాలయం వద్ద ఆర్డీవో మహిపాల్‌రెడ్డి, ఏవో సహదేవ్‌తో పాటు ఇతర ఉద్యోగులు, సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. వెల్దుర్తి, మాసాయిపేట, చేగుంట తహసీల్ కార్యాలయాల వద్ద ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.

కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు అవగాహన

చేగుంట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఆన్ జాబ్ ట్రైనింగ్‌లో భాగంగా మంగళవారం చేగుంట మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు కంప్యూటర్ విద్యపై అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల సర్వే వివరాలను కంప్యూటర్‌లో పొందుపర్చడంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

మహారాష్ట్ర ఎన్నికలపై మంత్రి ఉత్తంతో ఎంపీ సమీక్ష



కాంగ్రెస్ పార్టీ సమీక్షలో మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డి, ఎంపీ సురేష్ షెట్కార్

నారాయణఖేడ్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలో ఈ నెల 20న అసెంబ్లీ ఎన్నికలతో పాటు నాందేడ్ పార్లమెంట్ స్థానానికి ఉప ఎన్నిక జరుగనున్నది. నాందేడ్ పార్లమెంట్ స్థానంతో పాటు దాని పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్‌లకు జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డి, అక్కడి పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు. సమీక్షలో షెట్కార్ పాల్గొని కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు అవకాశాలను వివరించారు.

మెగా హెల్త్‌క్యాంపునకు విశేష స్పందన



పోతిరెడ్డిపల్లిలోని పీహెచ్‌సీ ఆవరణలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

సంగారెడ్డి రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో పీహెచ్‌సీ సబ్ సెంటర్‌లో మంగళవారం వెల్‌నెస్ ఆసుపత్రి అధ్వర్యంలో నిర్వహించిన మెగా హెల్త్ క్యాంపునకు విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో రోగులకు ఉచితంగా ఈసీజీ, బీపీ ఇతరత్రా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.

మూఢ నమ్మకాలపై విద్యార్థులకు అవగాహన

వెల్దుర్తి, నవంబరు12(ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థి మూఢనమ్మకాలపై అవగాహన కలిగి ఉండాలని వెల్దుర్తి ఎస్‌ఐ రాజు పేర్కొన్నారు. మంగళవారం వెల్దుర్తి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, శ్రీరాయరావు సరస్వతి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మూఢ నమ్మకాల నిర్మూలనపై సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ కమిటీ సభ్యుడు నరేష్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సమాజంలో మూఢనమ్మకాలను విద్యార్థులు వదిలిపెట్టి శాస్త్రీయ సమాజ నిర్మాణానికి నడుంబిగించాలన్నారు. బాల్య వివాహాలకు విద్యార్థులు దూరంగా ఉండి కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. సమావేశంలో ఏఎస్‌ఐ సాదత్‌మియా, పోలీసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెరువులో చేపపిల్లలను వదిలిన ఎమ్మెల్యే



నర్సాపూర్: రాయరావు చెరువులో చేపపిల్లలు వదులుతున్న ఎమ్మెల్యే

నర్సాపూర్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ రాయరావు చెరువులో మత్స్యశాఖ అధ్వర్యంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి చేపపిల్లలు వదిలారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్‌చైర్మన్ నయిమోద్దీన్,అధికారులు, మండలపార్టీ నాయకులు పాల్గొన్నారు. చేపపిల్లలు వదిలే కార్యక్రమానికి అధికారుల ఆహ్వానం మేరకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినీరెడ్డి ఉదయం 11గంటలకు చెరువు వద్దకు వచ్చారు. గంట పాటు అక్కడే వేచి ఉన్నా ఎమ్మెల్యేతో పాటు అధికారులు ఎవరూ రాకపోవడంతో సమయానికి రాకపోవడమేంటని అసంతృప్తి వ్యక్తం చేస్తూ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

జిల్లా అధికారిపై ఆగ్రహం

చేపపిల్లల కార్యక్రమానికి సంబంధించి సమాచారమివ్వడంలో నిర్లక్ష్యం వహించడంతో పాటు ఫ్లెక్సీలో ఎమ్మెల్యే కంటే గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఫొటో పెద్దదిగా పెట్టడంపై ఎమ్మెల్యే సునీతారెడ్డి మత్స్యశాఖ జిల్లా అధికారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు తీరు మార్చుకోవాలని హెచ్చరించారు.

● నిజాంపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని మత్స్యశాఖ సిబ్బంది డేవిడ్ రాబర్ట్ పేర్కొన్నారు. మండలంలోని చల్మెడ గ్రామంలో మంగళవారం మత్స్యశాఖ ఆధ్వర్యంలో భ్రమాండ్ల చెరువు, సోమయ్య చెరువులో చేపపిల్లలను వదిలారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సోమ లింగారెడ్డి, విస్తరణ అధికారి రాజు, మల్లేశం, జయరాజు, గంగపుత్రులు పాల్గొన్నారు.

కోహీర్‌లో పారిశుధ్య కార్మికుల సమ్మె



గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

కోహీర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని కోరుతూ కోహీర్ గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారం రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 23 మంది కార్మికులకు చెల్లించాల్సిన నాలుగు నెలల వేతనం రూ.9.20 లక్షలు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రోజూ క్రమం తప్పకుండా పనులు నిర్వహిస్తున్నప్పటికీ ప్రభుత్వ మాత్రం తమకు వేతనాలు సకాలంలో చెల్లించడం లేదన్నారు. దీంతో దుకాణాల్లో బాకీలు పెట్టి సరుకులు తెచ్చుకుంటూ అప్పులపాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తమకు బకాయిపడిన వేతనాలను వెంటనే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. తమ సమస్య పరిష్కరించేవరకూ సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు.

సమగ్ర కుటుంబ సర్వే పక్కాగా నిర్వహించాలి

సంగారెడ్డి అర్బన్/నాగల్‌గిద్ద/చిన్నశంకరంపేట/మాసాయిపేట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వేను పక్కాగా నిర్వహించాలని సంగారెడ్డి స్పెషల్ ఆఫీసర్, యువజన క్రీడల శాఖ సంగారెడ్డి జిల్లా అధికారి ఖాసీం బేగ్ సూచించారు. సంగారెడ్డి పట్టణంలో జరుగుతున్న సమగ్రకుటుంబసర్వేను మంగళవారం ఆయన పరిశీలించారు. ఇంటింటికీ తిరుగుతూ కుటుంబాల వివరాలు నమోదు చేస్తూ సందేహాలను నివృత్తి చేశారు. నాగల్ గిద్ద మండల పరిధిలోని దామర్‌గిద్ద, ముక్టాపూర్, వల్లూర్, గ్రామాన్ని మంగళవారం మండల ప్రత్యేక అధికారి బలరాం, ఎంపీడీవో మహేశ్వర్ రావు, కులగణన సర్వేప్రక్రియను పరిశీలించారు. మెదక్ జిల్లా చిన్నశంకరంపేట కొరివిపల్లి గ్రామంలో ఇంటింటి సర్వేను మెదక్ డీపీవో యాదయ్య పర్యవేక్షించారు. మాసాయిపేట మండలం కొప్పులపల్లి గ్రామంలో మండల ప్రత్యేక అధికారి జ్యోతి బృందం ఇంటింటికీ తిరుగుతూ కుటుంబ సర్వే నిర్వహించారు.

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి

సంగారెడ్డి అర్బన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): యువత పొగాకు ఉత్పత్తుల వినియోగానికి దూరంగా ఉండాలని సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, జిల్లా పొగాకు నియంత్రణ సూపర్‌వైజర్ విష్ణువర్ధన్‌రెడ్డి కోరారు. సంగారెడ్డిలోని ఐబీలో పొగాకు నియంత్రణపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. పొగాకు రహిత సమాజం కోసం యువత కృషి చేయాలని సూచించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి తోపాజి అనంతకిషన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత క్యాన్సర్ పరీక్షలు



మహిళలకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

శివ్వంపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో పరిశ్రమ ఏర్పాటు చేసి స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే కాకుండా సంపాదనలో కొంత భాగం ప్రజలకు సేవ చేయాలన్నదే తమ ఉద్దేశమని ఫ్లెమింగ్ పరిశ్రమ ఎండీ ప్రకాష్ పేర్కొన్నారు. మండల పరిధిలోని నవాబ్‌పేట్‌లో ఫ్లెమింగ్ పరిశ్రమ సౌజన్యంతో మంగళవారం మహిళలకు హైదరాబాద్ బసవతారక క్యాన్సర్ ఆసుపత్రి వైద్యులచే ఉచిత క్యాన్సర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. హెల్త్ క్యాంప్‌ను పరిశ్రమ హెచ్‌ఆర్ మనోహర్, ప్రతినిధి శ్రీనివాసులు ప్రారంభించారు. సుమారు 70 మంది మహిళలకు అల్ట్రాసౌండ్, మంమోగ్రఫీ, ఎక్స్‌రే, పాప్స్మెర్ పరీక్షలను నిర్వహించినట్లు క్యాంప్ కోఆర్డినేటర్ ఆదిత్య తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు సులోచన,రాణి, నాగ ప్రశాంతి, ప్రదీప్ రెడ్డి, వీఆర్వో లక్ష్మణ్ వైద్య సిబ్బంది మాజీ సర్పంచ్ అశోక్ రెడ్డి ఉన్నారు.

వరి కొనుగోళ్లను వేగవంతం చేయండి



గుమ్మడిదల: వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మాధురి తదితరులు

గుమ్మడిదల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వరి కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ మాదురి అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని నల్లవల్లి, గుమ్మడిదల గ్రామంలో కొనసాగుతున్న వరి కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ మాధురి, అధికారులతో కలిసి పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియ నిర్వహించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలలో నెలకొన్న సమస్యలను రైతులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అధికారులకు అదనపు కలెక్టర్ పలు మార్గదర్శకాలు సూచించారు. రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. వెంట జిల్లా ప్రాజెక్టు మేనేజర్ జయశ్రీ, గుమ్మడిదల తహసీల్దార్ గంగాభవాని, డిప్యూటీ తహసీల్దార్ కరుణాకర్‌రావు, ఏపీఎం శివకుమార్, పీఏసీఏఎస్ నంద్యాల విష్ణువర్ధన్ రెడ్డి, ఏవో శ్రీనివాస్‌రావు, సీఈవో లక్ష్మణ్‌నాయక్ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

శివ్వంపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల వరకు సన్న రకం ధాన్యం కూడా కొనుగోలు చేయాలని కేంద్రం నిర్వాహకులకు నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్ ఆదేశించారు. రాబోయే రెండు మూడు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున తూకం వేసిన ధాన్యాన్ని రోజువారిగా వెంట లిఫ్ట్ చేయాలని సూచించారు. మంగళవారం శివ్వంపేట, చండీ కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ కమలాద్రితో కలిసి పరిశీలించారు.

అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి



సీఎంకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, నవంబరు, 12(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాని కోరుతూ మంగళవారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లానని పేర్కొన్నారు. నియోజకవర్గంలో మెరుగైన మౌలిక వసతులు, పౌరసేవలను అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పటాన్‌చెరుకు మంజూరైన రెవెన్యూ డివిజన్, పాలిటెక్నిక్‌కళాశాల, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం మంజూరు చేయాలని కోరామన్నారు. త్వరలోనే అన్ని సమస్యలను పరిష్కరిస్తానని సీఎం హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు.

అమ్మో.. దొంగలు



మెదక్ మండలం కాదులూర్ శివారులోని ఎల్లమ్మ ఆలయ హుండీని కొల్లగొట్టిన దొంగలు(ఫైల్)

(5వ పేజీ తరువాయి)

అపహరించారు. ఇక్కడ సీసీ కెమెరాలు లేవు.

● మనోహరబాద్ మండలంలోని ఓ పరిశ్రమలో సుమారు రూ.8లక్షల విలువైన సామగ్రిని చోరీ చేయగా 12మందిపై కేసు నమోదు చేసి ఏడుగురిని పట్టుకున్నారు. మిగతా ఐదుగురు పరారీలో ఉన్నారు.

● వట్‌పల్లి మండలం పలువట్లలో ఇటీవల ఓ ఇంట్లో 4తులాల బంగారం, రూ.20వేల నగదు అపహరించారు. ఈ కేసును తాజాగా పోలీసులు చేధించారు.

నిఘా వైఫల్యమే కారణమా..

దొంగతనాల మూలంగా ప్రజల్లో అభద్రతాభావం ఏర్పడుతోంది. ఓ పక్క దొంగతనాలు జరగడం, నేరస్థులను అదుపులోకి తీసుకొవడం, మళ్లీ చోరీలు పునరావృతం కావడం ఆందోళనను కలిగిస్తోంది. ఇటు సంగారెడ్డి, అటు మెదక్ జిల్లాల ఎస్పీలు ఎప్పటికప్పుడు రివ్యూ మీటింగ్‌లు, కాన్ఫరెన్సులు చేపడుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలోని లోపాలే ఈ ఘటనలకు కారణమవుతున్నాయి. నిత్యం గ్రామాల్లో పోలీస్ పెట్రోలింగ్ చేయడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏదైనా సంఘటన జరిగినప్పుడే పోలీసులు తమ గ్రామానికి వస్తున్నారే తప్ప తరచుగా రావడం లేదని అంటున్నారు. ఇక చాలాచోట్ల సీసీ కెమెరాలు నిద్రావస్థలోనే ఉన్నాయి. ఒకప్పుడు పోలీసులు సమన్వయం ప్రదర్శించి అందరి సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. నేరాలు జరగకుండా, నేరస్తులను గుర్తించడంలో ఇవి కీలకంగా మారాయి. కానీ ప్రస్తుతం సీసీ కెమెరాలపై సరైన పర్యవేక్షణ కానరావడం లేదు. మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లో నిఘా పరంగా పర్వాలేదు. కానీ గ్రామాలు, మారుమూల కాలనీల్లో మాత్రం నిఘా వైఫల్యం కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోంది.

రోడ్లపై ధాన్యం ఆరబోస్తే చర్యలు

శివ్వంపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రోడ్లపై ధాన్యం ఆరబోస్తుండడంతో వాహనదారులు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని, రోడ్లపై ధాన్యం ఆరబోయవద్దని తహసీల్దార్ కమలాద్రిచారి పేర్కొన్నారు. మంగళవారం శివ్వంపేట తహసీల్దార్ కమలాద్రిచారి ఆర్‌ఐ కిషన్‌తో కలిసి చెన్నాపూర్ రోడ్డుపై అరపోసిన ధాన్యం కుప్పలను పరిశీలించి రోడ్లపై ధాన్యం రాశులు పోస్తే చర్యలు తప్పవని రైతులను హెచ్చరించారు. రోడ్లపై ఆరబోసిన ధాన్యాన్ని కుప్పలుగా చేసి బండరాళ్ల పెట్టడంతో రాత్రి సమయాల్లో వాహనదారులు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

పుల్‌కల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి):చౌటకూర్ మండలం బొమ్మారెడ్డిగూడెం గ్రామంలో హనుమాన్ ఆలయ నిర్మాణానికి సంగారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ రాంచందర్ నాయక్ రూ.50 వేల విరాళాన్ని అందజేశారు. గ్రామానికి చెందిన పలువురు గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు జైపాల్‌నాయక్ అధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం రాంచందర్ నాయక్ నివాసానికి వెళ్లడంతో ఆయన విరాళాన్ని అందజేశారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



ఆర్థికసాయం చెక్కును అందజేస్తున్న ఖేడ్ ఎమ్మెల్యే

నారాయణఖేడ్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం ఖేడ్‌లోని తన నివాస గృహంలో ఆయన గైర్హాన్ తండాకు చెందిన కమలాబాయికి కల్యాణ లక్ష్మి చెక్కును, మండల కేంద్రమైన సిర్గాపూర్‌కు చెందిన బాల్‌రాజ్‌కు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన ఆర్థిక సహాయం చెక్కును అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శంకరయ్యస్వామి, శంకర్‌నాయక్, ప్రశాంత్‌పాటిల్, రాంరెడ్డి, భక్షిరాం, మారుతినాయక్, తదితరులు ఉన్నారు.